క్లుప్తంగా

సుబ్బాలమ్మ జాతర



డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ దుర్గాశేఖర్‌రెడ్డిలను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంగారు, వెండి వర్తకులు మంగళవారం సుబ్బాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని పట్టణ బులియన్ అసోసియేషన్ భవనంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారి సేవ, జాతరకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డిలను అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. అనంతరం ఊరేగింపుగా సుబ్బాలమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శి రాయుడు వీరా స్వామినాథన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఐ.పోలవరం: జాతీయ రహదారి 216పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన దోనిపాటి రాజు(26) కాకినాడ నుంచి అమలాపురం మోటారు సైకిల్‌పై వెళుతుండగా కొమరగిరి జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. మృతుడిని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీవీసీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తమ్మారెడ్డి శివశంకర ఫణికి కేఎల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాని ప్రదానం చేసింది. అల్ట్రా లోపవర్ పేరలెల్ ఎసిలేటర్ ఫర్ ఎనర్జీ–ఎఫిసెంట్ ఇన్ మల్టీకోర్ ఎంబెడెడ్ సిస్టమ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా వరించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌చార్జ్ టీవీ జనార్దనరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన శివశంకర్ ఫణికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు సత్కారం

అల్లవరం: ఎమ్మెల్సీగా విజయం సాధించిన తరువాత తొలిసారిగా తుమ్మలపల్లి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాత్రు శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం

అమలాపురం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జగనన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అన్నారు. బండారులంకలోని సచివాలయాలు 1, 2 పరిధిలో సుమారు రూ.44 లక్షలతో ఎగ్జిబిషన్ స్ట్రీట్, అంబేడ్కర్ నగర్, వల్లూరు వారి పుంత, ఇందిరానగర్, పేరివారి కాలనీ, చొల్లంగి వారిపాలెం, కందులపాడు, దుమ్ములగూడెంల్లో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లు, వాటర్ పైప్‌లైన్ పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకలాపాలను అడ్డుకుంటాం

అల్లవరం: బోడసకుర్రు గ్రామానికి ఐదు నెలలు క్రితం మంజూరు చేసిన రూ.కోటి నిధులను తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరిస్తూ ఓఎన్‌జీసీ అధికారులకు గ్రామస్తులు మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, దొమ్మేటి సురేష్, చెల్లుబోయిన రమేష్, జల్లి రాధాకృష్ణ మంగళవారం వినతిపత్రం అందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: పటవల పంచాయతీ ఈబీసీ కాలనీకి చెందిన కౌలు రైతు బావిశెట్టి శ్రీనివాసరావు(43) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావు గత ఆరేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయం కలిసి రాకపోవడం, కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 2వ తేదీ రాత్రి పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు హుటాహుటీన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసకుమార్ తెలిపారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు.

సుపరిపాలనకు నిదర్శనం సురక్ష

- ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్
- లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత



జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



ఇంజరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రాణి మిరియం జ్యోతి తదితరులు

అల్లవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సుపరిపాలనకు నిదర్శనమని ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌లు అన్నారు. మొగళ్లమూరు, తుమ్మలపల్లి గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌లు రాయుడు విష్ణు, వడ్డి సుభాషిణిల అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్‌లను జగనన్న సురక్ష శిబిరాల ద్వారా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వర్తించని వారిని గుర్తించి, వారికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ల చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను అందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబశివ ప్రసాద్, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరీ, మాకే కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యుడు పల్లి జేమ్స్‌రాజు, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, గృహసారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, పులుసుగంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తాళ్లరేవు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. మంగళవారం ఇంజరం పంచాయతీ సచివాలయం–2లో సర్పంచ్ ముద్దన వెంకట శివ రామ ప్రసాద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 456 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి లక్ష్మీనరసయ్య, డీటీ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్ కుమారి, చంటి తదితరులు పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోండి

ముమ్మిడివరం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు జయలక్ష్మి సూచించారు. ముమ్మిడివరం మండలం కర్నివానిరేవు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కాశి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అన్నంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మట్టపర్తి సత్యనారాయణ అధ్యక్షతన, నగరపంచాయితీ పరిధి రాయుడుపాలెం సచివాలయం వద్ద కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్‌లు పాల్గొని అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సురక్ష

ఐ.పోలవరం: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమమని ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అన్నారు. మండలంలో మురమళ్ల సచివాలయం–2, పాతయింజరం గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమ సభ జరిగింది. లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాశే రాజుబాబు, తహసీల్దారు ఝాన్సీ రాణి, ఎంపీడీఓ డి.రాంబాబు, కొండేపూడి కృపావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి సచివాలయం–2, చల్లపల్లి సచివాలయం–2ల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు పాల్గొని ఎస్.కొత్తపల్లిలో 1072, చల్లపల్లిలో 1120 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు.

పారా లీగల్ వలంటీర్లకు అవగాహన సదస్సు

ముమ్మిడివరం: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రజలకు చట్టాల గురించి వివరించాలని మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా సూచించారు. కోర్టు ఆవరణలో రెండు రోజులుగా నూతనంగా ఎంపికైన పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌వీ ప్రసాద్, న్యాయవాదులు దాసరి సత్యనారాయణ, ఎం.అలీ హసన్, కేఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ తరగతులు

కాట్రేనికోన: మత్స్యశాఖ, అటవీ శాఖలు సంయుక్తంగా పల్లంలో ఎఫ్‌డీఓ రామకృష్ణ అధ్యక్షతన మత్స్యకారులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో జిల్లా మత్స్యశాఖ ఉపసంచాలకుడు సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ చేపలు, రొయ్యలను ఎండబెట్టి నాణ్యమైన ఉత్పత్తులను తయారుచేసి అధిక ధరలు పొందొచ్చని సూచించారు. అనంతరం స్మోకింగ్ మిషన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ స్టేట్ ఫిషరీష్ ఎఫ్‌డీఓ కె.చలపతి, ఎఫ్‌డీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- చొల్లంగిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఇందిరమ్మ కాలనీలో స్థానిక మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన చొల్లంగి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. మహిళలు ఎమ్మెల్యే పొన్నాడకు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, నాయకులు బూరెల వెంకట్రాజు, కాపవరపు శ్రీదేవి, శివాజీ గణేష్, వారా సూర్యకుమారి, మాసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన ఇందిరమ్మ కాలనీవాసుల కల

తాళ్లరేవు: ఎంతో కాలంగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న చొల్లంగి పంచాయతీ ఇందిరమ్మ కాలనీ వాసుల కల నెరవేరింది. ఇందిరమ్మ కాలనీలో రూ.28 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఎమ్మెల్యే పొన్నాడ ప్రారంభించి స్వయంగా తాగునీరు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, దున్నా జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ బిల్లుల్లో పారదర్శకత ఏది..?

- ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లు, రెన్యువల్స్‌లో లోపాలు
- మున్సిపాలిటీలో పలు విభాగాలను పరిశీలించిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: మున్సిపల్ వాహనాలకు రోజూ వినియోగించే డీజిల్ వాడకం, బిల్లుల సమర్పణలో పారదర్శకత లోపించిందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. మున్సిపాలిటీలోని పలు విభాగాల రికార్డులు, బిల్లులను ఆయన మంగళవారం స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో నెలకొన్న లోపాలు, ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ వాహనాలకు రోజూ ఒక్కో వాహనానికి 20 లీటర్ల ఆయిల్ కొట్టిస్తున్నట్లు చూపిస్తున్నా ఎంత వినియోగిస్తున్నారో వివరాలు లేవన్నారు. ఆయిల్ బిల్లుల అంశంపై దృష్టి సారించాలని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి దాదాపు రూ.10 లక్షలు వసూలు కావాల్సి ఉన్నా ఏమి చేస్తున్నారని ఆయన సంబంధిత అధికారిని ప్రశ్నించారు. అలాగే లైసెన్స్‌ల రెన్యువల్ కూడా చేయకుండా మిన్నకుండిపోవడంపై మండిపడ్డారు. మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో ప్రజాప్రతినిధి కాని ఓ వ్యక్తి ఆదేశాలతో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడంపై ఎమ్మెల్సీ అభ్యంతరం చెప్పారు. వీటికి మున్సిపాలిటీ నిధులు వెచ్చిస్తే సహించేదిలేదని, ఆయన సొంత పెత్తనంతో వేయించారు కాబట్టి ఆయన్నే ఈ నిధులను భరించమని సలహా ఇచ్చారు. మున్సిపాలిటీ పాలనలో రాజ్యాంగేతర శక్తుల ప్రమేయాన్ని సహించబోమని ఆయన హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్సీ వాటర్ వర్క్స్ విభాగాన్ని పరిశీలించి తాగునీటి సరఫరాకు వినియోగించే విద్యుత్ మోటార్లను ఆన్ చేసి పర్యవేక్షణ లేకుండా వదిలేయడంపై ఎమ్మెల్సీ అభ్యంతరం చెప్పారు. ఎమ్మెల్సీ వెంట మున్సిపల్ కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర, దొంగ చిన్నా, యండమూరి శ్రీను, గోపీ రమేష్, యనమదల కరుణాకర్ తదితరులున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

రెండు కార్ల ఢీ

అమలాపురం రూరల్: అమలాపురం బైపాస్ రోడ్డులో కామనగరువు ఆదిలక్ష్మి రొయ్యల ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం రాత్రి రెండు కార్లు వేగంగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో హుటాహుటీన స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు స్థానిక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఏర్పాటుచేసిన రోశయ్య చిత్రపటానికి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యెండూరి వెంకట్రామయ్య, నంబూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్కుకు వాటర్ ట్యాంక్ బహూకరణ

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనం(పార్కు)కు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్‌ను బహూకరించారు. పార్కులో కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ ఆధ్వర్యంలో మంగళవారం రోశయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయానికి రూ.10 వేలు విరాళంగా అందజేశారు.

విప్లవ యోధుడు అల్లూరి

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- వాడవాడలా అల్లూరి జయంతి వేడుకలు



చినకొత్తలంకలో అల్లూరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ఎంపీడీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సునీత తదితరులు



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

ముమ్మిడివరం: విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన వీరుడని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, పొత్తూరి ఉమారాణి, సొసైటీ అధ్యక్షులు పీటీవీ వర్మ, పి.ఉదయ్‌భాస్కర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చూపించిన విప్లవ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక లైన్స్ క్లబ్ హాలులో సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అల్లూరి 125వ జయంతి సభలో నానిరాజు మాట్లాడారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవి నల్లా నరసింహామూర్తి 'ఆంధ్ర వీర విప్లవ కిషోరం మన్యం వీరుడు అల్లూరి' అనే కవితను చదివి వినిపించారు. కవులు బీవీవీ సత్యనారాయణ, పోలిశెట్టి గౌతమ్ తదితరులు స్వీయ కవితలు వినిపించారు.

తాళ్లరేవు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత ఆధ్వర్యంలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జిపేటలో అల్లూరి విగ్రహానికి స్థానిక క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఏఓ చింతా మోహన కృష్ణ, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్.కొత్తపల్లిలో సీతారామరాజు విగ్రహానికి గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ రాజు, నడింపల్లి వెంకట సుబ్బరాజు, కృష్ణ, రాంబాబు, కూసంపూడి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

యానాం: అల్లూరి సీతారామరాజు త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీరోడ్డులో క్షత్రియ పరిషత్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని ఎదుర్లంక, కొమరగిరి, కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా రంగా జయంతి



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కాపు నాడు వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులు

అమలాపురం టౌన్: మాజీ ఎమ్మెల్యే, కాపు నాయకుడు వంగవీటి మోహన రంగా 76వ జయంతి వేడుకలను అమలాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శుభ కలశం వద్ద రంగా విగ్రహానికి కాపు నాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అయితాబత్తుల సుభాషిణి, పీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కల్వకొలను వీధిలోని రంగా విగ్రహానికి కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్ కల్వకొలను తాతాజీ, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను తదితరులు నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి, విలసవిల్లి, చల్లపల్లి గ్రామాల్లో వంగవీటి మోహన్ రంగా 76వ జయంతి వేడుకల్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విలసవిల్లిలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, సుంకర బుజ్జి, సలాది శివాజీ, కోలా ఏసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కోడి పందేలపై దాడి

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం శివారు యడ్లరేవులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరాలపై పోలీసులు మంగళవారం దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,400 నగదు, ఒక కోడి పుంజుని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

న్యాయవాదుల నిరసన

అమలాపురం టౌన్: న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కోర్టుల భవనం వద్ద అఖిల భారత న్యాయవాదుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ధర్నా చేశారు. జిల్లా శాఖ అధ్యక్షుడు, న్యాయవాది ఎండీ ఆజామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో ఎవరైనా న్యాయవాదులు చనిపోతే తక్షణమే రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు చింతపల్లి అజయ్‌కుమార్, అడపా ప్రసాద్, సయ్యద్ హమీద్ షా, కుడుపూడి అశోక్, సంసాని అనిల్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

ముమ్మిడివరం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మిడివరం కోర్టు ఎదుట న్యాయవాదులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఏఎల్ ముమ్మిడివరం శాఖ అధ్యక్షుడు కోన వెంకట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పార్క్ స్థలాన్ని నేను సూచించలేదు' ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్

యానాం: డంపింగ్‌యార్డు వల్ల కనకాలపేట, భీమ్ నగర్, యూకేవీనగర్ ప్రాంతాల వాసులు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని కోరానే తప్ప ఫలానా ప్రాంతంలో డంపింగ్ యార్డు పెట్టాలంటూ స్థలాన్ని తాను సూచించలేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో ఆర్ఏఓ మునిస్వామితో కలిసి రిసోర్స్ రీసైక్లింగ్ పార్క్ గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఆర్‌సీ పార్కు స్థలం ఎంపికలో తనకెలాంటి సంబంధం లేదన్నారు. యానాం ప్రజలకు హాని కలిగించేలా తాను ఎటువంటి పనులు చేపట్టనని స్పష్టం చేశారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

ముమ్మిడివరం: పామును చూసి డ్రైవర్ భయంతో స్టీరింగ్ వదిలేయడంతో కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన ముమ్మిడివరం మండలం గాడిలంకలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యానాంకు చెందిన ఓ కుటుంబం కారులో కొత్తలంక బాబా దర్గాకు కారులో వెళుతుండగా గాడిలంక చేరుకునేసరికి ఒక్కసారిగా స్టీరింగ్‌పైకి పాము రావడంతో డ్రైవర్ భయంతో స్టీరింగ్ వదిలేశాడు. దీంతో కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో స్థానికులు స్పందించి కారులో ఉన్న ముగ్గురిని సురక్షితంగా బయటకు తీశారు. యానాంలోని తన స్వగృహంలో పూల తోట ఉందని, రాత్రి సమయంలో పాము కారులోకి వచ్చి ఉంటుందని కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

అమలాపురం టౌన్: జిల్లా విశ్వ బ్రాహ్మణ యూత్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. జిల్లా విశ్వ బ్రాహ్మణ యూత్ ప్రతినిధులు కోసూరి చిదంబరాచారి, బొల్లోజు మణి శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం దాదాపు 300 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజరాజేశ్వరి, విజయకుమారి, సంఘ ప్రతినిధులు తాళాబత్తుల రాజేష్, నాగోజు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులను తక్షణం నింపాలి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తక్షణం అన్ని రక్షిత మంచినీటి చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని ఆర్ఏఓ మునిస్వామి ఆదేశించారు. పలు తాగునీటి చెరువుల్లో నీటిమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన పిల్లంక–బ్రహ్మపురి వద్ద ఉన్న ఫ్రెంచి కాల్వ నుంచి నీటిని తరలించి చెరువులు నింపాలని పీడబ్ల్యూడీ ఇంజినీర్లకు సూచించారు. ఈ సందర్భంగా పిల్లంక వద్ద ఉన్న ఇంజరం బ్యాంక్ కెనాల్, నల్లచెరులను పరిశీలించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సేవ, పరిశ్రమల రంగాల్లో యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో స్పందన హాల్లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన పాల్గొని నిరుద్యోగ యువతతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేస్తున్న జాబ్‌మేళాలను, శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా వచ్చిన ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంచెలంచెలుగా శిక్షణ పొందుతూ ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రకర్ జైన్, వికాస జిల్లా కోఆర్డినేటర్ గోళ్ళ రమేష్ పాల్గొన్నారు.

200 గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ

జిల్లాలో సుమారు 200 గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం అమలుకు కార్యాచరణ సిద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ సంస్థ త్వరలో పాలసేకరణ రూట్ మ్యాప్‌లు రూపొందించి కార్యాచరణను సిద్ధం చేస్తుందని తెలిపారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తాం

టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టిడ్కో లబ్ధిదారుల సమస్యలపై టిడ్కో, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక సమావేశం నిర్వహించి సమీక్షించారు.